ఆ రోజు ఉగాది.
ప్రకృతికే పర్వదినంగా వుంది.

కోయిలలు కొత్తపాటలు పాడుతున్నాయి. చెట్లు కొత్త చిగుళ్ళతో పచ్చగా మెరిసిపోతున్నాయి.

కొత్తశోభలు సంతరించుకున్న ప్రకృతిని చూసి పరవశించి పోతూ వూళ్ళోకి చేరుకున్నాడు అర్పిత్.

వీధి గుమ్మం దాటి ఇంట్లోకి వెళ్ళబోయిన వాడల్లా రెండడుగులు వెనక్కు వేసి నిలబడిపోయాడు పక్కింటి ముందు ముగ్గువేస్తున్న ముద్దమందారాన్ని చూసి.

# రోజీ లవ్

—అలపర్తి రామకృష్ణ

"అమృతా... బాగున్నావా?

సూట్ కేస్‌తో ఠీవిగా నిలబడ్డ అర్పిత్‌ను చూసి సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది అమృత. ముగ్గు డబ్బా అరుగు మీద పడవేసి లోపలికి పరిగెత్తింది. పూల రథం లోపలికి దొర్లుకుంటూ వెళ్ళినట్లుగా అన్పించిందతనికి.

ప్రేమ విత్తనం లాంటిది —

ఒంటరిగా, ప్రాణం లేనట్లుగా కన్పిస్తుంది. ఆ విత్తనాన్ని ఎంత పరీక్షించి చూసినా వ్రేళ్ళు కన్పించవ్... కొమ్మలు కన్పించ వు...

భూమితో సంబంధం లేనప్పుడు అలా కన్పిస్తుంది విత్తనం. భూమిలో పడి చెమ్మగిల్లగానే మొలకెత్తి మహా వృక్షమైపోతుంది...

అమృతను చూడగానే ప్రేమ సముద్రాలన్నీ గుండెలో చేరి పొంగుతున్నట్టు అన్పించింది అర్పిత్‌కు.

నవ్వుకుంటూ ఇంట్లోకి అడుగుపెట్టాడు.

"ఏమేవ్... నీ ఇంజనీర్ కొడుకు వచ్చాడు" హాల్లో పడక కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్న బలరామయ్య వంటింట్లో వున్న భార్యకు వినపడేటట్లుగా పెద్దగా అన్నాడు.

పిండి రుబ్బుతున్న బసవమ్మ చేతులు కడుక్కోకుండానే హాల్లోకి వచ్చేసి కొడుకును చుట్టుకుపోయింది.

"తప్పిపోయిన అవుదూడ మళ్ళీ కన్పించగానే దగ్గర చేరి నాకుతున్న గోమాతలా కన్పిస్తున్నావే నువ్వు" అన్నాడు బలరామయ్య నవ్వుతూ.

"అబ్బో... మీరేదో కొడుకును చూసి సంబరపడనట్లు... కొడుకు ఇంజనీరింగ్ పూర్తి చేశాడని వూళ్ళో అందరికి చాటింపు వేస్తూనే వున్నారుగా!" భర్తకు చురక తగిలించింది.

అందరూ నవ్వుకున్నారు.

"క్యాంపస్ సెలక్షన్ అయ్యాయి నాన్నా! నేను సెలక్ట్ అయ్యాను... ఓ నెల రోజుల్లో అపాయింట్‌మెంట్ ఆర్డర్ రావచ్చు" అన్నాడు అర్పిత్ తండ్రి ప్రక్కన వున్న కుర్చీలో కూర్చుంటూ.

"నువ్వు కష్టపడి చదువుకున్నందుకు ఫలితం దక్కింది... సర్లే! తరువాత తీరిగ్గా మాట్లాడుకుందాం గాని... ముందు వెళ్ళి స్నానం చేసి రా!" అన్నాడు బలరామయ్య పేపర్లో మళ్ళీ తలదూరుస్తూ.

కాఫీ కలుపుకు రావడానికి వంటింట్లోకి వెళ్ళింది బసవమ్మ.

టూత్ బ్రష్ నోట్లో పెట్టుకుని పెరట్లోకి వచ్చాడు అర్పిత్.

అతని కళ్ళు అమృత కోసం వెతికేయి.

అర్పిత్, అమృతల ఇళ్ళు ప్రక్కప్రక్కనే. రెండు ఇళ్ళ మధ్య ఐదడుగుల ఎత్తు వున్న ప్రహరీ గోడ వుంది.

అడ్డు గోడ దగ్గరకెళ్ళి పక్కింటివాళ్ళ పెరట్లోకి చూశాడు.

అమృత తండ్రి సాంబయ్య పాలు పితుకుతూ కన్పించేడు. అమృత తల్లి తులసికోట చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కన్పించింది. గుండరాయితో కుంకుడు కాయలు కొడుతూ వుంది అమృత.

అమృత దృష్టిని ఆకర్షించాలని చేతికి అందిన మామిడి కొమ్మను ఊపడం — చెట్టుమీద కూర్చున్న పిట్టల్ని అదిలిస్తున్నట్టు చిన్నగా చప్పట్లు కొట్టాడు.


"ఎప్పుడొచ్చావబ్బాయ్? పరీక్షలు అయ్యాయా?" అర్పిత్‌ను చూసి అడిగింది కమలమ్మ.

"వొచ్చి అరగంట అవుతుందండి... పరీక్షలు పూర్తయ్యాయి" అమృత వైపే చూస్తున్న కళ్ళను మందలించి దృష్టి మరోవైపుకు మరల్చుతూ అన్నాడు అర్పిత్.

పాలు పితకడం అయ్యేక అర్పిత్‌ను పలకరించి పాలచెంబుతో లోపలికి వెళ్ళాడు సాంబయ్య.

కమలమ్మ కూడ పెరట్లో నుండి ఇంట్లోకి వెళ్ళేక అమృతను గోడ దగ్గరకు రమ్మని సైగ చేశాడు. తటపటాయిస్తూనే వొచ్చింది.

ఆ సౌందర్యరాశి ముద్దులమోము చూసి పరవశం చెందాడు.



"గోడ దగ్గరకు రమ్మని పిలిచి మౌనంగా వుండిపోయారే?" పెదాలు సుతారంగా కదిలిస్తూ మెల్లగా అందామె. ఎవరన్నా వొస్తున్నారేమోనని అటు, ఇటు పరికిస్తూనే.

"మనస్సుకు నచ్చినవాళ్ళు సమీపంలో వుంటే మౌనంగా వుండిపోవడం ఎంతో హాయినిస్తుంది" అన్నాడతను.

చిరునవ్వులు చిందిస్తూ అక్కడి నుంచి కదలబోయింది.

"వెళ్ళిపోతావేం? ఒక్క క్షణం ఆగు... హైద్రాబాద్ నుంచి నీకు బహుమతి తెచ్చాను"

"ఏమిటది?"

"వెండి పట్టీలు తెచ్చాను... నీ మృదువైన పాదాలు నా చేతులతో తాకుతూ వాటిని తొడుగుతాను" అన్నాడతను తమకంతో.

"అబ్బ... ఎంత ఆశ? నాకిచ్చెయ్యండి... వీలున్నప్పుడు కాళ్ళకు వేసుకుంటాను"

"అదేం కుదరదు... రాత్రికి పెరట్లోనే పడుకో ... నేను గోడదూకి వచ్చి నీ పాదాల దగ్గర వ్రాలతాను".

"ఇంజనీరు గారు ఎక్కడవున్నా గోలు దూకుతారా?"

"గోడలు దూకడం ఓ గొప్ప కళ.. వయస్సులో వున్నప్పుడు వలచిన ప్రేయసిని కలవడానికి గోడ దూకకపోతే జీవితం నిరర్థకమే! పెళ్ళయ్యాక నాలుగు గోడల మధ్య పెట్టుకునే వెయ్యి ముద్దుల కంటే పెళ్ళికాక ముందు ప్రేయసి ఇచ్చే ఒక్క ముద్దు ఎంతో మధురం" అన్నాడు అర్పిత్ తన్మయత్వంతో.

సూర్య కిరణాలు ఆమె పెదాల పైనపడి మిల, మిలా మెరుస్తున్నాయి.

"రెండు నిముషాలు మీ దగ్గర నిలబడే సరికే ముద్దుల వరకూ వెళ్ళిపోయారు. మరో క్షణం ఇక్కడ నిలబడితే నన్ను గర్భవతిని చేసేటట్లు వున్నారు... నేనెళ్ళిపోతాను" అంటూ అక్కడనుంచి తుర్రుమంది అమృత.

★★★

రోజులు ఆనందంగా గడిచిపోతున్నాయి అర్పిత్‌కు.

ఉదయాన్నే పొలాల గట్ల మీద తిరిగి రావడం, లైబ్రరీలో పేపర్లు తిరగేయడం, శివాలయం దగ్గర పున్నాగచెట్ల క్రింద కూర్చుని గ్రామస్థులతో పిచ్చాపాటి మాట్లాడటం, పన్నెండు గంటలకు ఇంటికి తిరిగొచ్చి సుష్టుగా భోజనం చేసి రెండు, మూడు గంటలు నిద్రపోవడం, సాయంత్రం చెరువు గట్టిమీద షికారు —

ఆకాశంలో ఎగిరే పిట్టలను, అందమైన సూర్యాస్తమయం చూసేసి ఇంటికి తిరిగి వచ్చెయ్యడం —

వీలు దొరికినప్పుడల్లా పెరట్లోని గోడ ప్రక్కన చేరి అమృతతో స్వీట్ నథింగ్స్ చెప్పడం — అదీ దినచర్య.

ఎక్కువ సేపు అమృతతో కబుర్లు చెప్పుకోవడానికి వీలు పడటం లేదు. రెండు మూడు సార్లు అమృత వాళ్ళ యింట్లోకి వెళ్ళేదు గాని, పెద్దవాళ్ళు వుండటంతో అస్సలు అతనితో మాట్లాడేదే కాదు.

ఎవరూ లేనప్పుడు పెరటిగోడ దగ్గరే అతనితో సరదాగా మాట్లాడేది.

వెండి పట్టీలు ఆమెకు ఇవ్వడమే పడటం లేదు అతనికి. తనే స్వయంగా ఆమె కాలికి అమర్చాలని అతను ఉవ్విళ్ళూరుతుండటంతో అతనికి వీలు చిక్కడం లేదు.

గోడ దూకే కార్యక్రమం కోసం ముహూర్తం పెట్టుకున్నాడు.

వెన్నెల రాత్రి —

అందరూ నిద్రపోతున్నారు —

అర్పిత్ వొక్కడే నిద్ర రాక — అమృతకు ఇవ్వటానికి కాలి పట్టీలు జేబులో వేసుకుని చప్పుడు కాకుండా అడుగులో అడుగు వేసుకుంటూ పెరటి గోడ దగ్గరకెళ్ళాడు.

పంతొమ్మిదేళ్ళ వయసు మిస మిసలతో పరువాలను పరువుమీద పర్చుకుని పెరట్లో మంచం మీద పడుకున్న అమృత వెన్నెల్లో అప్సరసలా కన్పించింది. .. "రాచెల్ రూబెన్‌లా వుంది"... 'నా అందాల రాచెల్ రూబెన్' అనుకున్నాడు మనసులో.

ఆ అమ్మాయి ఎప్పుడూ తన ప్రేమను మాటల్లో చెప్పలేదు. మూగ కమల భాషతోనే తన ప్రేమను వ్యక్తం చేసేది.

అమృత హస్తాల బిగి కౌగిలిలో కరిగిపోవాలని, అమృత సొనలలో తడిసిపోవాలనే ఆరాటంతోనే గోడ దూకే ప్రయత్నంలో పడ్డాడు అర్పిత్.

ప్రేమలో పడ్డవాళ్ళు కొన్ని అవకతవక పనులు చేస్తూ వుంటారు — ఆ అవకతవకలు కూడ అందంగానే వుంటాయి — పాల వెన్నెల్లా స్వచ్ఛంగానే వుంటాయి. కాలుష్యం గాని మనసుతో చేసేవి కాబట్టి ప్రయణమరక్తిని కలిగిస్తాయి.

'మనిషికి మనిషికి మధ్య ఈ అడ్డుగోడలెందుకో?' అనుకున్నాడు గోడ ఎక్కి అవతలవైపుకు దూకుతూ.



## మెసేజ్

"సార్! మీ పాప మిమ్మల్ని ఫోన్‌లో ముద్దు పెట్టుకోవాలనుకుంటున్నది!" అంది స్టెనో.

"నాకిప్పుడు టైం లేదు, ఆ మెసేజ్ నువ్వు తీసుకో, తర్వాత నీ దగ్గర నుంచి నేను తీసుకుంటా!" అన్నాడు మేనేజర్.


—పి.వి.మురళీకృష్ణ
(హైదరాబాద్)

అతను దూకగానే దభీమని చప్పుడయ్యింది.

ఆ చప్పుడుకు అమృత ప్రక్కనే మంచం వేసుకుని పడుకున్న సాంబయ్యకి మెలకువ వచ్చింది. లేచి కూర్చుని మంచం క్రింద వుంచిన కర్ర చేతిలోకి తీసుకున్నాడు.

'ఎవరు?' పెరటి గోడ ప్రక్కన అలికిడి విన్పించి గొంతు పెంచి పెద్దగా అన్నాడు సాంబయ్య

అర్పిత్‌కు ముచ్చెమటలు పట్టాయి. 'పార్కిన్‌సన్స్' జబ్బు వచ్చినట్లు అనిపించింది. కాళ్ళు చేతులు వొణకడం మొదలయ్యింది.



## పెళ్లి తప్పలా...!

చాలామంది నేను ఏ సినిమా నటినో పెళ్ళి చేసుకుంటానని పందాలు కట్టారు ... కాని ఓడిపోయారు.. అన్నాడు 'ప్రేమఖైదీ'తో తెలుగులో హీరోగా పరిచయమైన హారీష్... ఈ మధ్య ఎవరికీ చెప్పకుండా ఢిల్లీలో చదువుకుంటున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుని హనీమూన్‌కు కూడా వెళ్ళొచ్చాడు...! ఎప్పుడు ప్రేమించాడో, ఎప్పుడు పెళ్ళి చేసుకున్నాడో తెలియని హారీష్ మిత్రులు కొంత బాధపడ్డా... ఆశీర్వదించేశారు.. త్వరలో రామానాయుడుగారి చిత్రంలో జంధ్యాల దర్శకత్వంలో కనిపించబోతున్నాడీ కొత్త పెళ్ళికొడుకు...! —కృష్ణాజీ

దడ, దడ కొట్టుకుంటున్న గుండెను అదుపులో పెట్టుకుని మళ్ళీ గోడదూకి ఇంట్లో దూరాడు. మంచం మీదకు చేరుకుని తల నిండా దుప్పటి బిగించేడు.

మామిడి చెట్టు నీడలో అర్పిత్‌ను గమనించలేదు సాంబయ్య. గోడ దూకుతున్నది ఏ కుక్కో అనుకుని సమాధానపడి చెంబుడు మంచినీళ్ళు త్రాగి మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు.

మొదటిరాత్రి గోడదూకే ప్రయత్నం విఫలమయ్యింది.

'సాహసం చేయరా డింభకా! రాజకుమారి లభిస్తుందిరా!' మనస్సు వెన్ను తట్టి ప్రోత్సహించి రెండో రోజు రాత్రి గోడదగ్గరకు లాక్కొచ్చింది.

వెన్నెల పుచ్చపువ్వులా కాస్తూవుంది.

పెరడంతా పాలసముద్రంలా కన్పించింది. పాల సముద్రం మరుగుల మీద పడుకున్నట్లుగా అమృత కన్పించింది అవతలివైపు పెరట్లో.

గోడ దూకడానికి గోడమీద చెయ్యి వేశాడు.

చేతికి మెత్తగా తాకింది.

చేతి క్రింద వున్న మెత్తని పదార్థం సర్రున జారుకున్నట్లు, బుస్‌మన్న శబ్దం ఆ వెనువెంటనే విన్పించింది.

గోడ మీద వేగంగా పాక్కుంటూ వెళ్తున్న పామును చూడగానే అర్పిత్ గుండెలవిసిపోయాయి.

కంగారుగా వెనక్కి తిరిగి వచ్చేశాడు.

రెండు రాత్రులు వృథా అయిపోయాయి.

మూడో రాత్రి —

పట్టుదల వదలని విక్రమార్కుడిలా గోడ దగ్గరకు వచ్చాడు.

పిల్లగాలులు పూలతీగెల పరిమళాన్ని తెచ్చి అర్పిత్‌కు అందించేయి.

హృదయంలో ప్రేమ తరంగాలు ఉవ్వెత్తున లేచాయి.

మరికొన్ని క్షణాల్లో —


ఆమె లేత పెదాలు తన చెంపల్ని తాకుతాయి

తల్లో పెట్టుకున్న మల్లెపూల భారానికే తట్టుకోలేక చిక్కి సగమైపోయినట్లు కన్పించే ఆమె సన్నటి నడుము చుట్టూ తను చేతులు బిగిస్తాడు.

ఎటువంటి జంకూ గొంకూ లేకుండా తన హృదయాన్ని దొంగిలించేసి ముద్దులివ్వడానికి మాత్రం గునుస్తూ వుంటుంది — తను చొరవ తీసుకోగానే సంబరపడి పోతుంది —

మల్లె పందిరి ప్రక్కన తమ గుసగుసలకి నిద్రాభంగమైన గువ్వపిట్ట కళ్ళు చిట్లించి చూస్తూ వుంటుంది —

మధురంగా ముట్టడి చేసి ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఆలోచనల నుండి బయటపడి గోడ దూకేను.



దూకడంలో కాలు మడతబడింది.

కాలు బెణకడంతో అడుగు తీసి అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు. అతి కష్టం మీద మళ్ళీ గోడ ఎక్కి కుంటుకుంటూ నడుస్తూ ఇంట్లోకి నడిచేడు.

మూడు రాత్రులు ఎటువంటి మధురిమలు పంచకుండానే గడిచిపోయాయి.

నాలుగోరోజు మళ్ళీ ప్రయత్నం చేద్దామనుకున్నాడు గాని, పెద్ద అవాంతరం వచ్చి పడింది.

ఎంతో సఖ్యతగా వుండే రెండు కుటుంబాల మధ్య చిచ్చు చెలరేగింది.

సాంబయ్య పెరటిగోడ ప్రక్కనే పాడిగేదెల దగ్గరి రొచ్చంతా తెచ్చి చెత్త పోగు పెట్టడం బలరామయ్యకు నచ్చలేదు.

అదేదో చిన్న విషయమే కదాననుకుంటూ సాంబయ్యను కదిలించేడు.

"పోగు పెరటిగోడ పక్కనుండి తీసేసి పొలంలో వేసుకో సాంబయ్య బావా!" అన్నాడు బలరామయ్య.

"పోగువాసన మీకు నచ్చకపోతే ముక్కు మూసుకోండి... అందరి దొడ్లలో చెత్త పోగులున్నాయి... పోయి అందరికీ చెప్పు తీసెయ్యమని" కొంచెం కటువుగానే అన్నాడు సాంబయ్య.

ఒక్కరోజులోనే ఎంతో మార్పు వచ్చేసింది.

బసవమ్మ, కమలమ్మతో మాట్లాడటం మానేసింది. ఆ ఇంట్లో నుంచి ఉలవచారు, బీరకాయ పాలకూర, చింతకాయ పచ్చడి ఈ ఇంట్లోకి రావడం — ఈ ఇంట్లోనుంచి ములక్కాడలు వేసి పప్పుచారు, గారెలు, బూరెలు ఆ ఇంట్లోకి సరఫరా కావడం ఆగిపోయాయి.

ఎన్నో సంవత్సరాలు పట్టించుకోని చిన్న చిన్న విషయాలు భూతాల్లా కన్పించేయి. బలరామయ్యగారి దొడ్లోని మామిడిచెట్టు ఎండుటాకులు సాంబయ్యగారి దొడ్లో రాలడం — సాంబయ్యగారి కోళ్ళు బలరామయ్య దొడ్లో తిరగడం ఇబ్బందికరంగా కన్పించేయి.

ప్రశాంతంగా వుండే కొలనులో ఏనుగులు చేరి భీకరంగా పోట్లాడుకుంటుంటే బిత్తరపోయిన హంసల్లా వుంది అర్పిత్, అమృతల పరిస్థితి.

అమృత పెరటిగోడ దగ్గర నిలబడితే కమలమ్మ తిట్టిపోస్తున్నది కూతుర్ని. ఏదో వంకతో పెరట్లోకి వస్తున్న అమృత్‌ను మందిలస్తున్నాడు బలరామయ్య.

చిత్రకారుడు అందమైన బొమ్మను గీస్తుంటే ఎవరో కుంచె లాక్కొని, రంగులు నేలమీద పారేసినట్లు అయ్యింది.

తల్లడిల్లిపోయాడు అర్పిత్.

★★★.

బజాజ్ కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజనీరుగా పూనాలో ఉద్యోగం వచ్చింది అర్పిత్‌కు.



రేటు

"ఇంత చిన్న మామిడికాయ మూ దురూపాయలా?"

"పోనీ పొట్లకాయ తీసుకోండి. రూపాయికే వస్తుంది"

—సి హెచ్.లక్ష్మి (విజయవాడ)

మంచి వుద్యోగం వచ్చిందన్న సంతోషం కలగలేదతనికి.

గాయపడిన మనస్సుతోనే పూనా వెళ్ళిపోయాడు.

విజయదశమి, దీపావళికి సెలవులు దొరికినా స్వగ్రామం వెళ్ళలేదతను.

సంక్రాంతిలోపు తను అనుకున్నది జరుగుతుందని నమ్మకంలో వుండిపోయాడు. అతను ఆశించినట్లే ఇంటి దగ్గర నుండి వుత్తరం వచ్చింది.

ఓ శుభవార్త మోసుకొచ్చింది తండ్రి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం.

'సాంబయ్యగారి అమ్మాయితో పెళ్ళి నిశ్చయమైందని, ఓ నెలరోజులు సెలవు పెట్టుకుని వెంటనే రమ్మని' — ఆ ఉత్తరంలోని సారాంశం.

తాను అనుకున్నది సాధించానని విజయగర్వంతో తల ఎగరేసాడు.

ఇంటికెళ్ళగానే బలరామయ్య ముక్కచివాట్లు పెట్టాడు.

"మన ఇంటావంటా లేవురా ఇటువంటి అలవాట్లు... పెళ్ళి చేసుకుని కుదురుగా వుండు లేకపోతే పురుగు తొలచిన కాయలా పుచ్చిపోతావ్" బలరామయ్య కొడుకును మందలించాడు.

తలొంచుకుని తనలో తాను నవ్వుకుంటూ నిలబడ్డాడు అర్పిత్.

అమృతతో మాట్లాడటానికి వారం రోజులు వీలు చిక్కలేదు.

ఓరోజు మిట్ట మధ్యాహ్నం —

పెరట్లోకి అమృత రావడం గమనించాడు అర్పిత్.

ఆలస్యం చేయకుండా పెరటిగోడ దూకి ఆమె దగ్గరికి వెళ్ళాడు.

"నీ కోసం గంట సేపటి నుండి పెరట్లో పడిగాపులు కాస్తున్నాను" ఆమె చెయ్యి పట్టుకుని గడ్డివాము వెనుకవున్న బాదం చెట్టు నీడపట్టుకు లాక్కెళ్ళాడు.

చిత్రకారుడికే తృప్తినిచ్చే భంగిమలో వొద్దికగా కూర్చుంది బాదం చెట్టు క్రింద అమృత.

ఆమె అందం కళ్ళల్లో నిండుగా పడేసరికి కంటిరెప్పలు ఉద్వేగంతో కొట్టుకున్నాయి. గుండె అంతకంటే వేగంగా కొట్టుకుంది. గోదావరి వరదలా మనస్సు ఉప్పొంగింది.

అందాల వరూధిని ఎదురుగా కూర్చున్నట్లు —

మ్యూజియం నుంచి రెబెకా సుందరి తప్పించుకుని తన ఎదురుగా వచ్చి కూర్చునట్టు —

సౌందర్య దేవత వీనస్ ఎదురుగా ప్రత్యక్షమైనట్టు —

ఉక్కిరి బిక్కిరయిపోతూ ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

జేబులో నుంచి వెండి పట్టీలు తీసి ఆమె కాళ్ళకు తొడిగి ఆమె పాదాలను ముద్దు పెట్టుకున్నాడు.

"ఏమిటీ పిచ్చి పని?" కాళ్ళు వెనక్కు లాక్కుంటూ అతనివైపు ఆరాధనగా చూస్తూ అందామె.

"పూలపల్లకిలో ఊరేగుతున్నంత సంబరంగా వుంది నా బంగారు అమృతం నా ప్రక్కనే కూర్చుంటే" ఆమె ఒడిలో తలవాల్చి తన్మయత్వంతో అన్నాడతను.

"నాకంతా ఆశ్చర్యంగా వుంది... పోట్లాడుకున్న మన పెద్దవాళ్ళు ఇంత తొందరగా కలిసిపోయి వియ్యమందుతున్నారంటే నాకు నమ్మబుద్ధి కావడం లేదు" అందామె అతని చెంపలను తన చేతివ్రేళ్ళతో సుతారంగా నిమురుతూ.

"మా నాన్నకు ఓ ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చానులే... దాంతో అంతా సెట్ అయ్యింది.. ఎవరో రాసినట్లుగా మా నాన్నకు ఉత్తరం రాశాను... మీ అబ్బాయి పూనాలో చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నాడు... నలుగురు పిల్లలున్న ఓ స్త్రీతో మీవాడికి దోస్తీ కుదిరింది... ఎక్కడ చూసినా వాళ్ళిద్దరే కన్పిస్తున్నారు... వెంటనే పెళ్ళి చెయ్యకపోతే మీ చేతుల్లో నుంచి మీ అబ్బాయి జారిపోతాడు... అంటూ హెచ్చరిస్తూ ఉత్తరం రాశాను.. దానితో మా నాన్నకు తల తిరిగిపోయి ఎక్కడో ముక్కు మొహం తెలియని పిల్లని కోడలిగా తెచ్చుకోవడం కంటే సాంప్రదాయ కుటుంబంలో పెరిగిన బాగా తెలిసిన సాంబయ్యగారి కూతుర్ని కోడల్ని చేసుకోవడమే ఉత్తమమనే అభిప్రాయానికొచ్చేడు... నా పాచిక పారింది... ఈ ముద్దుల గుమ్మ నా సందిట చిక్కింది" అన్నాడతను నవ్వుతూ.

"మొత్తానికి ఎలక్ట్రిక్ ఇంజనీరుగారు షాక్‌లు ఇవ్వడం నేర్చుకున్నారన్నమాట" అందామె నవ్వుతూ.

"నీక్కూడా పెద్ద కరెంట్ షాక్ ఇస్తాను చూడు" అంటూ అతను ఆమెకు ఊపిరి సలపకుండా తన కౌగిట్లో బంధించేసి ముద్దుల వర్షం కురిపించేడు.

కిల కిలా నవ్విందామె.

"గోడలు దూకడంలో ఎక్స్‌పర్ట్ మీరు" గీరుకుపోయిన అతని మోచేతుల్ని నిమురుతూ అందామె.